క్లుప్తంగా

నేడు గ్రామదేవత ఉత్సవాలు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలంలోని తొగరాం గ్రామంలో మంగళవారం గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రెండేళ్లకు ఒకసారి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఎంతో వైభవంగా జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించి గ్రామ పెద్దలు, నిర్వాహకులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, తమ్మినేని చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

అన్నప్రసాదం వితరణ



అన్నప్రసాదాన్ని వితరణ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సంతలో 150 మందికి అన్నప్రసాదం వితరణ నిర్వహించారు. పేదలతో పాటు చేతివృత్తుల పనివారికి, పరిసర గ్రామాల నుంచి నరసన్నపేటకు వచ్చిన కూరగాయలకు అన్నప్రసాదాన్ని అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తంగుడు రత్నకుమార్, కార్యదర్శి పాట్నూరు రమేష్, ట్రెజరర్ కె.రమేష్, జెడ్‌సీ సభ్యులు రమణసాహు, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 వేల విరాళం



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న సర్పంచ్ సింహాద్రినాయుడు

కొత్తూరు: మండలంలోని గురండి పంచాయతీ పరిధిలో గల కాశీపురం గ్రామంలో నిర్మిస్తున్న రామాలయానికి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బోర సింహాద్రినాయుడు రూ.20 వేలను కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. సర్పంచ్‌ను కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

14న బౌద్ధ సమ్మేళనం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత జేఏసీ నాయకులు

సరుబుజ్జిలి: ఈ నెల 14వ తేదీన రొట్టవలస సమీపంలోని దంతపురి క్షేత్రంలో నిర్వహించనున్న బౌద్ధ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని దళిత జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మేళనం పోస్టర్‌ను సోమవారం బౌద్ధ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. శాంతి, అహింస, ధర్మ మార్గాలను బోధించిన మహానుభావుడు గౌతమ బుద్ధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత జేఏసీ నేతలు కళ్లేపల్లి రామ్‌గోపాల్, తైక్వాండో శ్రీను, కంఠ వేణుబాబు, బడే కామరాజు, బోనెల రమేష్, కొంచాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

అభినందన..



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జలుమూరు: ప్రతిభ గల విద్యార్థులకు గుర్తింపు ఉంటుందని శ్రీముఖలింగం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సూర్య ప్రభాకరరావు అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా డివిజనల్ స్థాయి శ్రీకాకుళంలో చైల్డ్ సేవ్ విభాగంలో నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు సత్తా చాటారు. వక్తృత్వ విభాగంలో రావాడ భాగ్యశ్రీ ప్రథమ స్థానం, వ్యాస రచనలో దుంపల ప్రణతి ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటారు. వీరికి పాఠశాల వద్ద హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కె.ఎం.మోహన్‌రావు, తదితరులు సోమవారం అభినందించారు.

ప్రజోపయోగ పనులకు పెద్దపీట

హిరమండలం: ఉపాధి హామీ పథకంలో ప్రజోపయోగ పనులకు పెద్దపీట వేస్తున్నట్టు ఏపీఓ శ్రీదేవి తెలిపారు. ఎల్.ఎన్.పేట గ్రామ పంచాయతీలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులకు సంబంధించి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. రైతులకు సాగునీటిపరమైన పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఓ తెలిపారు. గ్రామంలో 724 జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. 2025–26లో రూ.1.26 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్ ముగడ దివాకర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి జయమోహన్, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణరావు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలపై.. చిన్నచూపు..!



పిల్లర్ల స్థాయిలోనే నిలిచిన పాలవలస బల్క్ మిల్క్ కేంద్రం

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పాత భవనాల్లోనే విధులు
- ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు

ఆమదాలవలస నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణాల వివరాలు..

కేంద్రం	మంజూరు	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్నవి
సచివాలయాలు	76	40	36
రైతు సేవా కేంద్రాలు	76	49	27
వెల్‌నెస్ కేంద్రాలు	65	38	27
బల్క్‌మిల్క్ కేంద్రాలు	76	25	09

సరుబుజ్జిలి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రజల ముంగిటికు సేవలు అందించే విధానానికి తూట్లు పొడుస్తోంది. ఆమదాలవలస నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో సాంకేతిక కారణాలతో అరకొర నిర్మాణాలు జరిగిన భవనాల విషయంలో శ్రద్ధ చూపడంలేదు. దీనివలన ఉద్యోగులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో నిధుల వరద..

నియోజకవర్గంలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లోని 110 పంచాయతీల్లో ఒక్కో సచివాలయ భవనం కేటగిరీ–1కు రూ.45 లక్షలు, కేటగిరీ–2కు రూ.25 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.23 లక్షలు, వెల్‌నెస్ కేంద్రానికి రూ.21.80 లక్షలు చొప్పున కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేశారు. అప్పట్లో 70 శాతం భవన నిర్మాణాలు పూర్తిచేసుకొని ప్రారంభోత్సవాలు జరిగాయి.

కూటమి ప్రభుత్వం మోకాలడ్డు..

ప్రజల ముంగిటకు సేవలు అందించే విధానాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయం వ్యవస్థపై శీతకన్ను వేసింది. పనులు చేయక మిగిలిపోయిన ఒక్క భవన నిర్మాణానికి కూడా పైసా ఖర్చు చేయలేదు. ఒక్క పని కూడా ముందుకు సాగలేదు.



పిల్లర్ల స్థాయిలో నిలిచిన పాలవలస సచివాలయం



శ్లాబుతో ఉన్న చిగురువలస సచివాలయం



పాతపంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న పాలవలస సచివాలయం

ముందుకు సాగని పనులు..

సరుబుజ్జిలి మండలం పాలవలస సచివాలయం, బల్క్‌మిల్క్ సెంటర్ల నిర్మాణాలు సాంకేతిక కారణాలతో నిలిపివేశారు. శిథిలభవనంలోనే సచివాలయం నిర్వహిస్తున్నారు. పలుచోట్ల బల్క్‌మిల్క్ కేంద్రాల పనులు జరిగినా ఈ ప్రభుత్వం నిర్వహణ చేపట్టడం లేదు. ఆమదాలవలస మండలం కొర్లకోటలో స్థల వివాదం వలన సచివాలయ భవనం పనులు జరగలేదు.

శిథిల భవనాల్లోనే విధులు



సచివాలయం పనుల విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదు. సిబ్బంది శిథిలభవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. అరకొరగా నిర్మాణాలు చేసిన భవనాల విషయంలోనూ కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– **రావాడ రవి**, మాజీ వైస్ ఎంపీపీ, యరగాం, సరుబుజ్జిలి మండలం

సేవలు అందడం లేదు



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సచివాలయం వ్యవస్థను పట్టించుకోవడం లేదు. ప్రజల ముంగిటకు సేవలందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రస్తుతం సేవలు ప్రజలకు ఆశించిన స్థాయిలో అందడం లేదు.

– **ఇల్లాకుల శ్రీనివాసరావు**, నందికొండకాలనీ, సరుబుజ్జిలి మండలం

నివేదికలు అందించాం

సాంకేతికమైన కారణాలతో పలుచోట్ల ప్రభుత్వ భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. అసంపూర్తిగా మిగిలిన భవనాల విషయంలో ప్రభుత్వానికి నివేదికలు పంపించడం జరిగింది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– **ఆర్.కూర్మనాథ్**, పంచాయతీరాజ్, జేఈ, సరుబుజ్జిలి మండలం

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా

- మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు

జలుమూరు: డిజిటల్ బుక్‌తో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తారని నరసన్నపేట నియోజకవర్గ యువ నాయకుడు, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. శ్రీముఖలింగం, పెద్ద దూగాం క్లస్టర్లలో కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల అణిచివేతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దాడులు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అన్ని విధాలా వేధిస్తోందన్నారు. అటువంటి వారికి అండగా ఉండేందుకే డిజిటల్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. తొలిత శ్రీముఖలింగేశ్వరుని దర్శించుకుని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ వాన గోపి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దామ మన్మధరావు, నియోజకవర్గం గ్రీవెన్స్ అధ్యక్షుడు ధర్మాన జగన్, మహిళా విభాగం అధ్యక్షురాలు జి.వి.రమణి, ఆర్టీఐ అధ్యక్షుడు చింతా వెంకట రమణ, స్థానిక నాయకులు కె.హరిప్రసాద్, బి.వి.రమణ, సర్పంచ్ తర్ర మాధవి, తర్ర జీవరత్నం, మాజీ సర్పంచ్ మూకల్ల సత్యం, తదితరులు పాల్గొన్నారు.



శ్రీముఖలింగంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

వరద నీటికి విరిగిన శివుడి విగ్రహం



పాతపట్నం కాజ్‌వే వద్ద మహేంద్రతనయ నదిలో విరిగిన శివుడి విగ్రహం

పాతపట్నం: పాతపట్నం మహేంద్రతనయ నది కాజ్‌వే వద్ద నదిలో ఉన్న శివుడి విగ్రహం నీటి ప్రవాహానికి విరిగిపోయింది. ఇటీవల వర్షాలకు మహేంద్ర తనయ ఉద్ధృతంగా పారడంతో విగ్రహం నదిలో మునిగింది. ప్రవాహం తగ్గాక విగ్రహం విరిగిపోయినట్లు స్థానికులు గుర్తించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు రాపాక విద్యార్థి

పొందూరు: నరసన్నపేటలోని సత్యవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీలో రాపాక పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మెండ రేణుక అత్యుత్తమ ప్రతిభ చూపించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శారదాంబ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంసీ చైర్మన్ కె.శేషగిరి, పీడీ రమణమ్మ, గ్రామస్తులు అభినందించారు.



రేణుకను అభినందిస్తున్న హెచ్‌ఎం శారదాంబ

ఎక్కడి చెత్త అక్కడే..!

- రోడ్డు పక్కనే చెత్త కుప్పలు
- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- కలెక్టర్ హెచ్చరించినా పట్టించుకోని అధికారులు, సిబ్బంది



జలుమూరు మండలం చల్లవానిపేట జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న చెత్త కుప్ప



సారవకోట మండలం అలుదు గ్రామంలో రోడ్డు పక్కనే దర్శనమిస్తున్న చెత్త

సారవకోట: రహదారులపై పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను రహదారులకు పక్కనే పారబోస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చాలా చోట్ల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. నరసన్నపేట నియోజకవర్గంలోని సారవకోట మండలంలో 35 పంచాయతీలు, పోలాకిలో 31 పంచాయతీలు, నరసన్నపేటలో 34 పంచాయతీలు, జలుమూరు 40 పంచాయతీలు ఉన్నాయి. దాదాపు అన్ని పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

జాతీయ రహదారికి పక్కనే

నరసన్నపేట నుంచి ఒడిశాలోని మోహనా వరకు నిర్మించిన జాతీయ రహదారి 326–ఎ పక్కనే పలు గ్రామాల్లో చెత్తకుప్పలు దర్శమిస్తున్నాయి. సారవకోట మండలంలోని అలుదు, బురుజువాడ, బొంతు తదితర గ్రామాల్లో రోడ్డుకు ఆనుకుని చెత్త కుప్పలు వేస్తున్నారు. బుడితి నుంచి గుమ్మపాడు వెళ్లే రహదారిలో బుడితి, లక్ష్మీపురం, అవలింగి గ్రామాల సమీపంలో చెత్తకుప్పలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. జలుమూరు మండలంలోని చల్లవానిపేట నుంచి జంక్షన్ నుంచి శ్రీముఖలింగం వెళ్లే ప్రధాన రహదారిలో చల్లవానిపేట గ్రామానికి సమీపంలో సుమారు 200 మీటర్లు పొడవున చెత్త రోడ్డుకు పక్కనే దర్శనమిస్తోంది. ఈ చెత్త కుప్పల్లో పందులు, కుక్కలు ఇష్టానుసారంగా తిరుగుతుండటంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా కలెక్టర్ చెప్పినా..

పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సారవకోట మండలంలోని అర్లి నుంచి గోవర్ధనపురం గ్రామ రహదారి నిర్మాణ శంకుస్థాపనకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఆ సమయంలో పలు గ్రామాల్లో రహదారుల పక్కనే చెత్త కుప్పలు ఉండటాన్ని గుర్తించారు. మండల, గ్రామ స్థాయి అధికారులకు రోడ్డు పక్కనే చెత్తకుప్పలు ఉండకూడదని గట్టిగానే హెచ్చరించారు. అప్పట్లో కొంతమేరకు జేసీబీలు పెట్టి తొలగించినా.. ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతం అవుతోంది.

ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువ

రోడ్డు పక్కన ఉన్న ఈ చెత్తకుప్పల్లో పాలథిన్‌తో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసేందుకు అవకాశం ఉన్నా.. వాటిని రోడ్డు పక్కనే వేయడం వలన ఎన్నో అనర్థాలకు కారణం అవుతోంది. గాలులు వీచే సమయంలో ప్రయాణికులపైకి చెత్త ఎగరడంతో ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది.

నివారణకు చర్యలు తీసుకుంటాం



రోడ్డు పక్కనే చెత్తకుప్పలు లేకుండా పంచాయతీ కార్యదర్శులకు తగిన ఆదేశాలు జారీ చేస్తాం. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

– **ఎస్.వి.రమణ**, మండల పరిషత్ కార్యనిర్వాహక అధికారి, సారవకోట

అన్నసమారాధన



ఆమదాలవలస పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి త్రిరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలు, గ్రామాల నుంచి పట్టణానికి వచ్చిన ప్రజలు, భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పూజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– ఆమదాలవలస

నరకయాతన



ఈ చిత్రం పాతపట్నం మండలంలోని అంతరాబ నుంచి సరాలి వెళ్లే రహదారి దుస్థితి. రాళ్లుతేలి అధ్వానంగా తయారైంది. ఐదు నెలల క్రితం అభివృద్ధి పనులు చేస్తామని చెప్పి రహదారి మొత్తం తవ్వేసి విడిచిపెట్టారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్ అధికారుల వద్ద ఈ సమస్యను ప్రస్తావించగా.. త్వరలోనే రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– పాతపట్నం

భక్తిశ్రద్ధలతో గౌరీపౌర్ణమి

గౌరీపౌర్ణమి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకుని ముత్తైదువులు గౌరీదేవీ వ్రతాన్ని ఆచరించారు. కథ వృత్తాంతం శ్రద్ధతో విని తీర్థప్రసాదాలు స్వీకరించి, అందరికీ పంచిపెట్టారు. గౌరీపౌర్ణమి సందర్భంగా గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గౌరీదేవీని, నందెన్నను ఊరేగించారు. పలు గ్రామాల్లో పత్రి కొమ్మల ఉత్సవం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



హిరమండలం: హిరమండలంలో నందన్నను తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో కొమ్మల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



నరసన్నపేట: జమ్ములో నందెన్నను ఊరేగిస్తున్న భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగంలో గౌరీదేవి, నందన్నను ఊరేగిస్తున్న భక్తులు



పొందూరు: రాపాకలో గౌరీదేవీ, నందీశ్వరులను ఊరేగిస్తున్న గ్రామస్తులు



కొత్తూరు: కొత్తూరులో నందెన్న విగ్రహాన్ని తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



ఆమదాలవలస: శ్రీనివాసాచార్యులపేటలో గౌరీదేవికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు



శ్రీముఖలింగంలో పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

పరామర్శ..

ఆమదాలవలస: మండలంలోని చీమలవలస గ్రామానికి చెందిన మాజీ వైస్ సర్పంచ్ బొడ్డేపల్లి నర్సింగరావు గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో పార్టీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గురుగుబెల్లి శ్రీనివాసరావు, నాయకుడు సనపల ధనుంజయరావు, తదితరులు ఉన్నారు.



నర్సింగరావును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్